క్లుప్తంగా

ముఖలింగం మృతి పార్టీకి తీరని లోటు



ముఖలింగం మాస్టారు మృతదేహానికి నివాళులర్పిస్తున్న రవికుమార్

బూర్జ: మండలంలోని సింగన్నపాలెం గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గేదెల ముఖలింగం మృతి పార్టీకి తీరని లోటని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. గ్రామంలో సోమవారం నిర్వహించిన అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. జెడ్పీటీసీ బెజ్జిపురపు రామారావు, వైస్ ఎంపీపీ కరణం కృష్ణంనాయుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ గుమ్మడి రాంబాబు, కొల్లివలస సర్పంచ్ జీడి వేణు, మండల నాయకులు జల్లు బలరాంనాయుడు, ఇసాయి వెంకటరావు, వియ్యపు కృష్ణ,ఉన్నారు.

విధుల్లో చేరిన వైద్యులు

నరసన్నపేట: స్థానిక ఏరియా ఆస్పత్రిలో సోమవారం మరో ముగ్గురు వైద్యులు బదిలీపై వచ్చి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. స్త్రీ వైద్య నిపుణులుగా సివిల్ సర్జన్ ఉష అగనంపూడి నుంచి ఇక్కడకు వచ్చారు. వైద్యురాలు హెచ్.అరుణకుమారి(సీఎస్ఆర్ఎంఓ) టెక్కలి నుంచి వచ్చారు. పాలకొండ నుంచి మత్తు వైద్యులు (సీఏఎస్) శ్రీధర్ వచ్చారు. ఈ మేరకు ఏఓ ఏపీవీ రమణమూర్తి తెలిపారు.

నేడు మండల సమావేశం

బూర్జ: ఈ నెల 24వ తేదీన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ కర్నేన దీప అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ ఆర్.తిరుపతిరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి అన్నిశాఖల అధికారులు పూర్తి సమాచారంతో విధిగా హాజరుకావాలన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొనాలని కోరారు.

విచారణ..



పోస్టాఫీసులో విచారణ చేపడుతున్న అధికారులు

హిరమండలం: మండలంలోని ధనుపురం పోస్టాఫీసులో సోమవారం ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. పోస్టల్ కార్యాలయంలో అవకతవకలు జరిగాయంటూ గ్రామస్తుల ఫిర్యాదు మేరకు టెక్కలి డివిజన్ పోస్టల్ అధికారి ప్రసాద్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. పోస్టల్ వినియోగదారులతో పాటు ఫిర్యాదుదారుల నుంచి వివరాలు సేకరించారు. సంబంధిత రికార్డులను పరిశీలించారు. దర్యాప్తు నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తామని విచారణ అధికారి తెలిపారు. పోస్టల్‌కు సంబంధించి నిధులు పక్కదారి పట్టించారంటూ ఇటీవల గ్రామస్తులు కొందరు ఫిర్యాదు చేయడంతో విచారణ జరిగింది. దర్యాప్తు అధికారితోపాటు కొరసవాడ పోస్టల్ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

25న ఇంటర్వ్యూలు

సారవకోట: మండల కేంద్రంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీలు భర్తీ చేసేందుకు ఈ నెల 25న టెక్కలి ఆర్డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఈ మేరకు సీడీపీఓ హెచ్.కె.కామాక్షి సోమవారం తెలిపారు. ఈ ప్రాజెక్టు పరిధిలోని జలుమూరు మండలంలో గల కొమనాపల్లి-1, కరకవలస కాలనీ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయా పోస్టులను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తుదారులకు ఇప్పటికే కాల్ లెటర్లు అందజేశామన్నారు.

పొలంబడి షెడ్యూల్ విడుదల

నరసన్నపేట: మండల వ్యాప్తంగా రైతులు ఖరీఫ్ పనులు ప్రారంభించినందున పొలంబడి నిర్వహణకు గ్రామాల వారీగా షెడ్యూల్ విడుదల చేసినట్లు ఏఈ వై.సూర్యకుమారి సోమవారం తెలిపారు. ఈ నెల 24 నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు నిర్వహించనున్న పొలంబడి కార్యక్రమాలపై షెడ్యూల్ వేశామన్నారు. ప్రతీ మంగళ, బుధవారాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. రైతులు గమనించి సహకరించాలని కోరారు.

విద్యార్థుల సంఖ్య పెంచాలి

జలుమూరు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని డిప్యూటీ ఈఓ ఆర్.విజయకుమారి అన్నారు. సోమవారం జలుమూరులోని బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని, సంఖ్యను పెంచేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి నాణ్యతగా ఉండాలన్నారు. ఎంఈఓలు మాధవరావు, ప్రసాదరావు, హెచ్ఎం వేణుగోపాలరావు, సిబ్బంది పాల్గొన్నారు.

25న మర్రిగూడలో వినతుల స్వీకరణ

హిరమండలం: ఈ నెల 25 మర్రిగూడ గిరిజన గ్రామంలో వినతులు స్వీకరించనున్నట్లు ఎంపీడీఓ కాశీప్రసాద్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు సోమవారం తెలిపారు. ఈ శిబిరంలో వ్యక్తిగత, సామాజిక అంశాలపై వినతులు అందించవచ్చన్నారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది విధిగా హాజరుకావాలన్నారు. గిరిజనులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యువత పోరుబాట

- శ్రీకాకుళం తరలిన పార్టీ శ్రేణులు, యువకులు, నిరుద్యోగులు
- పలుచోట్ల బైక్ ర్యాలీలు



ఎల్.ఎన్.పేట: శ్రీకాకుళంలోని కలెక్టరేట్ వద్ద పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి, నియోజకవర్గ నాయకులు

ఎల్.ఎన్.పేట: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధిష్టానం ఇచ్చిన పిలుపుమేరకు సోమవారం శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద జరిగిన యువత పోరు కార్యక్రమానికి పాతపట్నం నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి నాయకులు, యువకులు తరలివెళ్లారు. ఎల్.ఎన్.పేట ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి, మండల ప్రెసిడెంట్ పెనుమజ్జి విష్ణుమూర్తి, మాజీ ఎంపీపీ, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి శిమ్మ సాంబశివరావు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కొల్ల కృష్ణ, పార్టీ నాయకులు ముగడ దివాకర్, లోచర్ల మల్లేశ్వరావు, పల్లి సంజీవరావు, పెద్దకోట రాము, తలసముద్రం శోభన్ బాబు, గేదెల శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు. పాతపట్నం నుంచి ఏనుగుతల సూర్యం, ఎం.తాతయ్య, పనుకు మోహన్, గొకవలస రాము, పడ్డ నేతాజీ, మద్ది రామయ్య, తదితరులు బయలుదేరి వెళ్లారు. మెళియాపుట్టి మండల అధ్యక్షుడు పోలాకి జయమునిరావు, సామలో, మాడుగుల మణికంఠ ఉన్నారు. కొత్తూరు మండల అధ్యక్షుడు గండివలస ఆనందరావు, ఎంపీపీ సవర సావిత్రి, ఎంపీటీసీ వనుము లక్ష్మీనారాయణ, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు చింతాడ సూర్యనారాయణ, సర్పంచ్ యర్లంకి ధర్మారావు, నాస బాలకృష్ణ, నాగేంద్ర, అంపిలి బుచ్చిబాబు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు నిమ్మగడ్డ కృష్ణారావు, సవర రమేష్, తదితరులు పాల్గొన్నారు. హిరమండలం మండలం అధ్యక్షుడు మీసాల వెంకటరామకృష్ణ, జిల్లా కార్యదర్శి ఎ.వి.సురేష్, వంగపల్లి చిన్నారావు, గవర గంగధరరావు, వెలమల బాలరాజు, చక్ర బాలకృష్ణ, బైతు మురళి, ఎస్.లక్ష్మణ్, పి.తేజేశ్వరరావు, పి.సింహాచలం, అన్ని విభాగాల నాయులు, కార్యకర్తలు, ప్రజలు తరలివెళ్లారు.



ఆమదాలవలస: ద్విచక్రవాహనాలపై యువతతో కలిసి బయలుదేరిన చింతాడ రవికుమార్

ఉద్యోగాలను ఊడదీస్తున్న ఘనత చంద్రబాబుదే..

ఆమదాలవలస: యువతకు ఉపాధి కల్పిస్తానని చెప్పి.. ఉన్న ఉద్యోగాలు ఊడదీస్తున్న ఘనత సీఎం చంద్రబాబుకు దక్కిందని, యువతను మోసం చేసిన చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పేందుకు అంతా సిద్ధంగా ఉన్నారని ఆమదాలవలస నియోజవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. శ్రీకాకుళంలో జరిగే యువతపోరు కార్యక్రమానికి సోమవారం ఆమదాలవలస నియోజకవర్గం నుంచి యువతతో కలిసి ద్విచక్ర వాహనాలతో ర్యాలీగా బయల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ నిరుద్యోగ భృతి కింద రూ.7,200 కోట్లు యువతకు ఈ ప్రభుత్వం బాకీ పడిందన్నారు. అన్నివర్గాల ప్రజలకు కూటమి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్, సరుబుజ్జిలి మండల అధ్యక్షుడు బెవర మల్లేశ్వరరావు, పార్టీ మేధావుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పల ఈశ్వరరావు, నాయకులు అత్తులూరి రవికాంత్, ముత్తా విజయ్, నిరుద్యోగులు, యువకులు పాల్గొన్నారు.

యువతను మోసం చేసిన చంద్రబాబు



నరసన్నపేట: పార్టీ శ్రేణులతో పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య

నరసన్నపేట/పోలాకి: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైనా యువతకు, నిరుద్యోగులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో వైఎస్సార్‌సీపీ ఇచ్చిన పిలుపుమేరకు సోమవారం యువత పోరు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నరసన్నపేట నుంచి అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు, యువకులు, నిరుద్యోగులు శ్రీకాకుళం తరలివెళ్లారు. స్థానిక పార్టీ కార్యాలయానికి నియోజకవర్గం నలుమూలల నుంచి చేరుకున్న పార్టీ యువజన విభాగం కార్యకర్తలు ద్విచక్ర వాహన ర్యాలీతో వైఎస్సార్ విగ్రహం వద్దకు చేరుకొన్నారు. వైఎస్సార్ విగ్రహానికి పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య నివాళులర్పించారు. నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి, జలుమూరు ఎంపీపీ వాన గోపి నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, నియోజకవర్గ, మండల యువజన విభాగాల అధ్యక్షులు దండి జయప్రకాష్, బుద్దల రాజశేఖర్, రెంటి కోట త్రినాథరావు, జుత్తు నేతాజీ, చింతు రామారావు, నక్క తులసీదాస్, పార్టీ మండల అధ్యక్షులు లుకలాపు రవి, వరుదు వంశీకృష్ణ, కణితి కృష్ణారావు, కనుసు సీతారాం, నరసన్నపేట మండల నాయకులు కేసీహెచ్‌బీ గుప్త, రాజాపు అప్పన్న, సురంగి నర్సింగరావు, పాగోటి గోవిందరావు, బొబ్బాది ఈశ్వరరావు, డీసీసీబీ మాజీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, పార్టీ యువజన విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చింతు రాఘవరావు, పోలాకి మండల పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు రెంటికోట త్రినాథరావు, పోలాకి మండల పరిషత్ సలహాదారు ముద్దాడ భైరాగి నాయుడు, యువజన విభాగం నాయకుడు చింతాడ ఉమామహేశ్వరరావు, కణితి సత్తిబాబు, చింతు రామకృష్ణ, పాలిన అప్పన్న, సాలిన నగేష్‌కుమార్, కూన ఢిల్లీశ్వరరావు, సోషల్ మీడియా కో-ఆర్డినేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

కృతజ్ఞతలు..



నరసన్నపేట: ద్విచక్ర వాహనాలతో ర్యాలీగా వెళ్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, యువకులు, నిరుద్యోగులు

వైఎస్సార్‌సీపీ పిలుపు మేరకు యువత పోరులో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్న పార్టీ శ్రేణులకు పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గం నలుమూలల నుంచి ద్విచక్ర వాహనాలతో తరలివచ్చి యువత పోరుబాట విజయవంతం చేశారన్నారు. ఇదే స్ఫూర్తితో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంను చేసేంత వరకు అందరూ సమన్వయంతో పని చేయాలన్నారు.

గ్రామ సర్వేయర్ల సమస్యలు పరిష్కరించాలి



పాతపట్నం: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామ సర్వేయర్లు



పోలాకి: తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నిరసన చేపడుతున్న గ్రామ సర్వేయర్లు



బూర్జ: తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న గ్రామ సర్వేయర్లు

పాతపట్నం/పోలాకి/బూర్జ: ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసినా ఎటువంటి పరిష్కారం చూపలేదని, రేషనలైజేషన్, బదిలీల ప్రక్రియ అమలు చేసే విధానంలో తమకు తీవ్రనష్టం జరుగుతుందని గ్రామ సర్వేయర్ల అసోసియేషన్ అధ్యక్షుడు కె.ఉదయ్‌కుమార్, కె.షణ్ముఖరావు, ఎ.అనిల్ అన్నారు. సోమవారం పాతటప్నం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎస్.ప్రసాదరావుకు గ్రామ సర్వేయర్ల సమస్యలు పరిష్కారించాలని వినతి పత్రం అందజేశారు. రీ సర్వే చేస్తున్న సర్వే ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారించాలని, భూ సర్వేయర్లలైన తమకు జనభా ప్రతిపదికన కాకుండా రెవెన్యూ విలేజ్ విస్తీర్ణం మేరకు హేతుబద్ధీకరణ చేయాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో పి.ఈశ్వరమ్మ, పి.మన్మధ, ఎం.రుక్మందరరావు, ఎ.నీలవేణి, ఆర్.యుమున పాల్గొన్నారు. పోలాకి తహసీల్దార్‌కు ఏపీ గ్రామ సర్వేయర్ల సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కార్యాలయం బయట నిరసన, నినాదాలు చేశారు. బూర్జ తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో గ్రామ సర్వేయర్లు ప్లకార్డులు ప్రదర్శించారు. సమస్యలు పరిష్కరించాలని నిరసన తెలియజేశారు.

బాధ్యతల స్వీకరణ



నరసన్నపేట: స్థానిక ఎంపీడీఓగా కె.వెంకటేశ్వర ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మండల పరిషత్ ఏఓ విజయానంద్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ మూర్తి, సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. అందరూ సమన్వయంతో పనిచేయాలని సిబ్బందికి ఎంపీడీఓ సూచించారు. ఉపాధి ఏపీఓ యుగంధర్, సిబ్బంది ఎంపీడీఓను కలిశారు. ఉపాధి పనులు జరుగుతున్న తీరుపై ఎంపీడీఓ ఆరా తీశారు. ఎంపీపీ ఆరంగి మురళిని ఎంపీపీఓ మర్యాద పూర్వకంగా కలిశారు.

సీఎస్‌డీటీగా కుమారి



పాతపట్నం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సీఎస్‌డీటీగా బి.కుమారి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె కొత్తూరు మండలం తహసీల్దార్ కార్యాలయంలో రీ సర్వే డీటీగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన సీఎస్ డీటీ బి.ప్రసాదరావు హిరమండలం తహసీల్దార్ కార్యాలయం సూపరింటెండెంట్‌గా బదిలీపై వెళ్లారు. కుమారికి తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు.

వైద్యాధికారిగా సుజాత



జలుమూరు: జలుమూరు పీహెచ్‌సీ వైద్యాధికారిగా గొలివి సుజాత సోమవారం బాధ్యతలు చేపట్టారు. రెండో వైద్యాధికారిగా ఎం.సంధ్య విధుల్లో చేరారు. ఉర్లాం నుంచి సుజాత ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన తాడేల శ్రీకాంత్ ఉర్లాం పీహెచ్‌సీకి బదిలీపై వెళ్లారు. సంధ్య సంతబొమ్మాళి నుంచి జలుమూరు వచ్చారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

నరసన్నపేట: ఈ నెల 25వ తేదీన మండలంలో గల ఉర్లాం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని ఈఈ జి.శంకరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చోడవరం ఫీడర్‌లో ఆర్‌డీఎస్ఎస్ పనులు నిర్వహిస్తామన్నారు. ఉర్లాం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

ఆమదాలవలస: ఈ నెల 24వ తేదీన మున్సిపాలిటీలోని 33/11 కేవీ పార్వతీశంపేట సబ్ స్టేషన్ పరిధిలో గల 11 కేవీ వెంకయ్యపేట ఫీడర్‌లో మరమ్మతులు, విద్యుత్ స్తంభాల మార్పులు చేపట్టనున్నారు. ఈ మేరకు ఈఈ పైడి యోగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపురం, జగ్గుశాస్త్రులపేట, ఏపీ టిడ్కో, చంద్రహర్ష, ఆక్వా, కేజీబీవీ పాఠశాల, ఆర్.ఆర్ గ్రానైట్, తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

ఆకలి కేకలు!

- వేతనాలు లేక అలమటిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు
- రెండు నెలలుగా అందని వేతనాలు
- వెంటనే చెల్లించాలని కోరుతున్న పారిశుద్ధ్య కార్మికులు



నరసన్నపేటలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

నరసన్నపేట: మేజరు పంచాయతీ నరసన్నపేటలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, వాటర్ వర్క్ సిబ్బంది, శానటరీ మేస్త్రీలకు రెండు నెలలుగా వేతనాలు అందకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఏప్రిల్, మే నెలలు వేతనాలు ఇవ్వాల్సి ఉంది. జూన్ నెల కూడా పూర్తి కావస్తుండటంతో మూడు నెలలుగా వేతనాలు చెల్లించాల్సి ఉంది. బీద కుటుంబాలకు చెందిన పారిశుద్ధ్య కార్మికులకు ఇలా నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోతే ఎలా అని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. అప్పులు చేసి కుటుంబాలను పోషించుకోవాల్సి వస్తుందని వాపోతున్నారు. మేజరు పంచాయతీలో 96 మంది పారిశుద్ధ్య సిబ్బంది ఉన్నారు. వీరందరికీ వేతనాలు చెల్లించాల్సి ఉంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో వీరందరికీ రెన్యువల్ చేయాలి. అనంతరం యథావిధిగా వేతనాలు చెల్లిస్తారు. నరసన్నపేట పంచాయతీ నుంచి రెన్యువల్‌కు సబంబంధించి డీపీఓ కార్యాలయానికి దస్త్రాలు పంపినా అనుమతులు రాలేదు. ఏదో ఒక కొర్రీ వేస్తున్నారని తెలుస్తోంది. ఈ కొర్రీలు కావాలనే వేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. దీంతో పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు చెల్లించడంలో జాప్యం అవుతోంది. ఇది తగదని, తమ కష్టానికి వేతనాలు నెలవారీ చెల్లించాలని పారిశుద్ధ్య కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఆందోళనకు దిగాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. డీపీఓ వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రతి నెలా వేతనాలు చెల్లించాలి

వేతనాలే ఆధారంగా కుటుంబాలను పోషించుకుంటున్నాం. ప్రతి నెలా వేతనాలు ఖాతాలకు జమ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే రెండు నెలల నుంచి వేతనాలు అందలేదు. జూన్‌తో మూడో నెల అవుతుంది. జులై మొదటి తేదీ నాటికైనా వేతనాలు చెల్లించాలి. వేతనాలు సకాలంలో రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం.

– బెవర రాము, పారిశుద్ధ్య కార్మిక సంఘం అధ్యక్షుడు

అనుమతి రావాలి..

నరసన్నపేటలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాల్సి ఉంది. డీపీఓ కార్యాలయం నుంచి అనుమతులు రావాలి. అనుమతి వచ్చిన వెంటనే వేతనాలను వారి ఖాతాలకు జమ చేస్తాం.

– ద్రాక్షాయిని, ఈఓ, నరసన్నపేట

ఆక్రమణలు తొలగించాలి



ఆక్రమణకు గురైన శ్మశాన స్థలం

కొత్తూరు: మండలంలోని మహసింగిలో దళితులకు చెందిన శ్మశాన వాటికలో ఆక్రమణలు తొలగించాలని గ్రామానికి చెందిన పైడి కులస్తుల జిల్లా సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు పసుపు రెడ్డి అశోక్ కుమార్, గ్రామస్తులు కోరారు. తహసీల్దార్ కె.బాలకృష్ణకు సోమవారం వినతిపత్రం అందజేశారు. శ్మశానం ఆక్రమణలకు గురికావడంతో దహన సంస్కరణల సమయంలో ఇబ్బంది పడుతున్నామన్నారు. గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి అనుకొని ఉన్న ఖాళీ స్థలాన్ని అంగన్‌వాడీ కార్యకర్త ఆక్రమించుకున్నారని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఆ ఖాళీ స్థలం గ్రామ కంఠమన్నారు.

1 నుంచి ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

హిరమండలం: కూర్మ ఆధ్యాత్మిక గ్రామంలో జూలై 1 నుంచి 15వ తేదీ వరకు ప్రకృతి వ్యవసాయం, పశుపోషణ, సాగు పద్ధతులపై యువకులకు శిక్షణ ఇవ్వనున్నట్లు వర్ణాశ్రమ కళాశాల ప్రతినిధులు సోమవారం తెలిపారు. ఇప్పటికే కూర్మ వైదిక గ్రామంలో సనాతన ధర్మం, ఆధ్యాత్మిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. అందులో భాగంగా భారతీయ సంస్కృతిని నెలకొల్పడం, స్వయం సంవృద్ధిని సాధించడం, పూర్వ వృత్తులను పునరుద్ధరించడమే లక్ష్యంగా ఈ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. యువతకు పశుపోషణ, పురాతన పద్ధతుల్లో వ్యవసాయం చేయడం వంటి వాటిపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని 30 ఏళ్ల లోపు యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో సైతం పేర్లు నమోదుచేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలకు 7732075607 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

బస్టాప్ ఏర్పాటు చేయాలి

జలుమూరు: మండంలోని తిలారు జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టడంతో కింద భాగంలో ఉన్న బస్టాప్‌ను పూర్తిగా నిలిపివేశారని రావిపాడు సర్పంచ్ బోర భారతితోపాటు సమీప గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. వంతెన పైనుంచి శ్రీకాకుళం, నరసన్నపేట బస్సులు పాతపట్నం, జలుమూరు, చల్లవానిపేట, శ్రీముఖలింగం వెళ్లిపోతున్నాయన్నారు. తిలారు జంక్షన్‌లో చిన్న దూగాం, రామినాయుడుపేట, తిలారు ఆర్ఎస్, రాణ, తదితర గ్రామాలతోపాటు తిలారు రైల్వేస్టేషన్‌లో దిగే ప్రయాణికులు పలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బస్టాప్ జంక్షన్‌కు కిలో మీటరు దూరంగా ఉండటంతో అక్కడకు నడిచివెళ్లేందుకు అవస్థలు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి వంతెన కింద భాగంలో బస్టాప్ ఏర్పాటు చేయాలని కోరారు.

ముమ్మరంగా వరి వెదలు



ఈ చిత్రం కొత్తూరు మండలం వసప వద్ద వరి వెదజల్లి పొలాన్ని ట్రాక్టర్‌తో దున్నుతున్న రైతు. వాతావరణం అనుకూలంగా ఉన్నందున రైతులు వరి వెదలు వేసే పనుల్లో బిజీగా ఉన్నారు. మండలంలోని 13,450 ఎకరాల్లో ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేస్తుండగా.. ఇందులో సుమారు 9 వేల ఎకరాల్లో వరి వెద పద్ధతిలోనే సాగు చేస్తున్నారు. గడిచిన ఏడాది వరి వెదల్లో కలుపు ఎక్కువగా మొలకెత్తినందున పంట దిగుబడి తగ్గింది. వెదలు చేయడం ద్వారా పెట్టుబడులు తగ్గడంతో సుమారు 70 శాతం వరకు ఈ పద్ధతిలోనే సాగు చేస్తున్నారు. కొంతమంది రైతులు ఈ ఏడాది వెదలను తగ్గించి దమ్ములు పట్టేందుకు ఇష్టపడుతున్నారు. – కొత్తూరు

దుమ్ము రేగుతోంది



ఆమదాలవలస మండలం కొత్తవలస గ్రామ సమీపంలో నాగవళి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీల వల్ల రహదారి పొడవునా దుమ్ము రేగుతోంది. రహదారులు పూర్తిగా పాడవటంతో ధూళి కళ్లల్లో పడుతోంది. ముఖ్యంగా నదీతీర గ్రామాల పరిధిలో రహదారికి ఆనుకొని ఉన్న నివాసితులు ధూళి రేగటంతో ఇబ్బంది పడుతున్నారు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని, రహదారిని బాగు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. – ఆమదాలవలస రూరల్